

# వెంకట్రావ్ డైరీ

- ఎ.వి.యస్. ప్రకాశరావ్

## డిసెంబర్ - 2

కెమిస్ట్రీ ప్రాక్టికల్ తగలేశాను. ప్రాక్టికల్ పూర్తయ్యేటప్పటికి నాలుగు దాటింది. కన్‌ఫర్ మేటరీ టెస్ట్ లేట్ అయింది. 'కన్‌ఫర్ మేటరీ టెస్టు చెయ్యడం రాద'ని కెమిస్ట్రీ డెమ్ (ముసలాడు) గొణుగుతున్నాడు. వాడి మొహం - షూట్ చెయ్యాలనిపించింది వెధవని. హాండ్స్ వాష్ చేసుకుని బయటకు వస్తుంటే డస్ట్ దగ్గర 'అబ్జర్వేషన్ బుక్' కనబడింది. లలితది. మరచిపోయిందేమో, రేపు రికార్డు చేసి తీసుక రాకపోతే 'హెచ్'కు రిపోర్టు చేస్తానన్నాడు ముసలాడు. Any how best oppertunity వాళ్ళ యింటికెళ్ళి యిచ్చేసి వస్తాను.

## డిసెంబర్ - 3

గవర్నర్‌పేటలో లలిత ఇంటికి 1-50 ఖర్చు పెట్టుకొని రిక్షాలో వెళ్ళాను. వాళ్ళ ఫాదర్, అల్సేషియన్ డాగ్‌లా వున్నాడు. గంటన్నర, తను చదువుకొనే రోజుల్లో వున్న డిసిప్లిన్ గురించీ, తన ప్రొఫెసర్ గురించీ బోరుకొట్టాడు. ఇంతట్లోనే 'ట్రంక్ కాల్' వచ్చిందని. గాలివానదాబులా పోస్టాఫీసుకు పరిగెట్టాడు. అంతట్లోకి లలిత హాల్లోకి వచ్చింది. అబ్బ.... యమాగా వుంది. రియల్లీ షి ఈజ్ వీనస్ (రతి) ఆఫ్ అవర్ కాలేజ్. అబ్జర్వేషన్ బుక్ యిస్తుంటే వెన్నెల్లా నవ్వుతూ థాంక్స్ చెప్పింది. సిట్‌గా కాలర్ సద్దుకుంటూ 'నో మెన్షన్' అందామనుకుంటే వెధవది కుదిరి చచ్చింది కాదు. అర గంట యింగ్లీష్ లిటరేచర్ గురించీ, హెమింగ్వే గురించీ అడక్కుండా స్పీచ్ యిచ్చి నా యింగ్లీషు నాలెడ్జి ప్రదర్శించడానికి ప్రయత్నించాను. హెమింగ్వే'స్ 'ది వోల్డ్ మేన్ అండ్ ది సీ' గురించి డిస్కస్ చేశాము.

## జనవరి - 3

లలిత బీచ్‌లో కనబడింది. లెక్చరర్స్. వాళ్ళ క్లాసులో మాట్లాడే అవాకులు. చెవాకులు యింగ్లీషు భాషను చేసే ఖూనీ గురించి అనర్గళంగా, 'ఇంతటా పెట్టుకు వచ్చి స్పీచి. యిచ్చే రాజకీయ నాయకుడిలా' మాట్లాడాను. 'ది వోల్డ్ మేన్ అండ్ దిసీ' చాలా బాగుందని యింకా యింగ్లీషు నావల్ ఏమన్నా వుంటే యిమ్మనీ అడిగింది. రేపు తప్పక మీ యింటికి పట్టుకొచ్చి యిస్తానని చెప్పాను.

## జనవరి - 4

మార్నింగ్ 7-30 కు లలిత దగ్గరకు వెళ్ళాను. లలితకు హెమింగ్వేస్

'మెన్ వితౌట్ విమెన్'
'ఎ ఫేర్ వెల్ టు ఆర్మ్స్'
'టు హేవ్ అండ్ హేవ్ నాట్'

యిచ్చాను. టు హేవ్ అండ్ హేవ్ నాట్'లో హెమింగ్వే యొక్క డైలాగు బిల్డప్ గురించి లలితకు చెప్పాను. ఎలాగోలా ఎట్రాక్ట్ చెయ్యాలి.

## జనవరి - 6

రేపు 26 ని, మీరూ డ్రామాలో ఏక్ట్ చేస్తున్నారా

అని అడిగింది. 'అబ్బే! నేను స్టేజీ ఎక్కితే కళ్ళు మూసుకోవలసివస్తుంది. ఆడియన్స్‌ను' అని జోక్ కట్ చేశాను. వెంటనే కంగారుగా 'మీ కేమండీ 'బ్యూటిఫుల్ పెర్సనాలిటీ' అని సిగ్గు పడింది. లలిత నన్ను లవ్ చేస్తూ వుండకపోతే అలా యెందుకు అంటుంది? వెంటనే సినిమా హీరోలా ఆమె చెయ్యితీసుకు ముద్దు పెట్టుకుందా మనుకున్నా. కానీ కాలుకు మెరుస్తున్న 'బాటాషూ' చూసి భయమేసింది. ఎంతయినా రాత్రేకదా 'హౌ టు విన్ ఫ్రెండ్స్ అండ్ యిన్‌ఫ్లుయన్స్ పీపుల్' చదివాను. అమాత్రం 'సైకాలజీ' తెలియదా? కంగారుపడకుండా నెమ్మదిగా ట్రీట్‌మెంట్ యిచ్చి మారేజికి ఒప్పించాలి. వెనకాల చాలా ఆస్తివున్నట్టు పనికిదిగాను.

## జనవరి -17

ప్రాక్టికల్ గంటలో చేసేశాను. డెమ్ రాజారావు (ట్)రైన్ చేశాడు. లలిత యింకా రేడికల్స్‌తో తంటాలు పడుతుంది. ప్రాక్టికల్ మీద యింటరెస్టు వున్నట్టు (నిజానికి ఆమెమీద యింటరెస్ట్) దగ్గరకు వెళ్ళాను. క్లోరైడ్ అని నెమ్మదిగా చెప్పాను. లాబ్‌లోంచి బయటకు వచ్చేక మెను 'చాలా జీనియస్' అంది. (ఆ కెంపర్ నడిగి ఏసిడ్ రాడికల్ ఏమిటో తెలుసుకున్నట్టు తెలియక). నన్ను లవ్ చేస్తూండకపోతే మొన్న 'బ్యూటిఫుల్ పెర్సనాలిటీ' అని యివ్వాళ 'జీనియస్' అని యెందుకంటుంది షి షేడ్ లవింగ్ మి. థాంక్ గాడ్.

## జనవరి -29

ఎగ్జామ్స్ దగ్గరకు వస్తున్నాయి. సెకండ్ క్లాస్ లోపల్లో పడవది మొహిగాడికూడా 'మార్క్స్' బాగా వచ్చాయి. రేపు యూనివర్సిటీ ఎగ్జామ్స్‌లో ఎలాయినా క్లాస్ తెచ్చుకోవాలి. రామారావుగారిని ఫిజిక్స్ 'ఎక్స్‌పెక్టెడ్ కొశ్చెన్స్' అడిగి, అవింత్సు మిగిలినవి చదువుకోవాలి.

## ఫిబ్రవరి-2

చలపతిగాడు. సునందకు లవ్‌లెటర్ వ్రాసి పొరబాటున సైన్ చేసేశాడు. యూనియన్ వచ్చి గంటసేపు యేడ్చాడు. కాలేజీకి లీవ్ అప్లైచేసి వాళ్ళ వూరు వెళ్ళేడు. అంత భయమెందుకు లవ్‌లెటర్ డ్రాప్ చెయ్యడమెందుకని? ఫూల్ ఫెలో లలిత సినిమాహాలు దగ్గర కనబడి తన ఫ్రెండ్ సునందకు చలపతి లవ్‌లెటర్ డ్రాప్ చేసినట్టూ. దానిని ప్రిన్సిపాల్‌కు యివ్వబోతున్నట్టూ చెప్పింది. ఏదో పొరపాటు జరిగిందని, యికెప్పుడూ అలాంటిది చెయ్యడనీ చలపతిగాడి తరుఫు నేను లలితకు. సునందకు అప్పాలజీ చెప్పేటప్పటికి తలప్రాణం తోక(?)కు వచ్చింది. ఈ అవకాశం బాగానేవుంది. ఇటు డిప్లమేటిక్‌గా పోజు యిచ్చి లలితనూ ఆకట్టుకొంటున్నాను. అటు చలపతిగాడు తిరిగి రాగానే 25 రూ. అప్పు కొట్టేస్తాను పెద్ద హెల్పు చేసినట్టు. ఇట్స్ ప్రాక్టికల్ గాడ్ ఈజ్ మెర్సిఫుల్.

## ఫిబ్రవరి - 4

పెళ్ళి సంబంధ మేదో వచ్చిందనీ. (కట్నం పదివేలకు తగ్గదు కనక) చాలా మంచి సంబంధమనీ నాన్న లెటర్ వ్రాశారు. 'నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసేదాకా పెళ్ళిమాట యెత్తొద్ద'ని జవాబు వ్రాశాను. లలిత సంగతి వ్రాస్తే. మళ్ళీ నెల మనియార్డరు చెయ్యరేమో నని భయమేసింది.

## మార్చి - 17

పరీక్షలు దగ్గరకు వచ్చాయి. చదవాలేదు, బాగానే చదివాను. లలిత కనబడకపోతే పిచ్చెత్తుతుంది. ప్రిపరేషన్ హాలిడేస్‌లో వాళ్ళ యింటికి వెళ్తే యేం బాగుంటుంది? అమ్మ నన్ను చూడాలని వుందనీ. ఆరోగ్యం జాగర్తని. బాగా చదవమని లెటర్ వ్రాసింది జవాబు వ్రాయాలి.

## ఏప్రిల్ - 3

పరీక్షలు యీ రోజుతో పూర్తయ్యాయి రాగానే వ్రాశాను. సైన్స్ సెకండ్ క్లాసు రావచ్చు. యిప్పుడు సీటు రాకపోతే ఎమ్మిటిడేషన్ చదువుతాను. లాంగ్వేజెస్ 52% వుంది కదా! నీట్‌గా డ్రెస్ అయి లలిత దగ్గరకు 'ఆటోగ్రాఫ్' కోసం వెళ్ళాను. 'లవ్' మాట చెప్పబోతుంటే లైన్‌లా వాళ్ళ నాన్న గదిలోకి వచ్చారు. పోనీ యింటికెళ్ళాక లెటర్ డ్రాప్ చేస్తాను. లెటర్ రాస్తే పంతగాడిలా అవుతుందేమో! 'ఫాయిడ్ సైకాలజీ' స్టడీ చేసినా 'లలిత మనస్సు' స్టడీ చెయ్యలేకపోతున్నాను.

## ఏప్రిల్ - 27

ప్రాక్టికల్స్ బాగానే చేశాను. అయినా 'ఓమాన్ స్ట్రెయిన్‌ను పూర్తిగా 'ఫాక్' ఇవ్వలేదు! రేపే ఇంటికిపోయి లలితకు లెటర్ డ్రాప్ చెయ్యాలి. ఈ సమ్మర్లో, థామస్ హార్డీ, స్టీవెన్‌సన్, రాబర్ట్ లిండ్, జాన్ స్టెయిన్‌బెక్, రైటింగ్స్ చదవాలి. లాంగ్వేజీమీద కమాండ్ లేకపోతే రేపు 'లిటరేచర్' ఎలా చదువుతాను?

## మే - 1

ఇక్కడేం యేం తోచడంలేదు. నాన్న పొలం పనులమీద అమ్మ వంట పనులలో మునిగి వున్నారు. అన్నయ్యకు రాజకీయాలు తప్పయింట్లో నా సంగతి పట్టదు. ఈవాళైనా రాత్రి కూచుని 'నీట్'గా లలితకు లెటర్ వ్రాయాలి. రసెల్‌ది 'మారేజ్ అండ్ మోరల్స్' చదివాను చాలా బాగుంది. కాని రసెల్ "ఫర్ యిన్ ఎక్స్‌పీరియెన్స్‌డ్, హౌ ఎవర్, ఇట్ యీజ్ వెరీ డిఫికల్ట్ టు డిస్టింగ్విష్ పాషనేట్ లవ్ ఫ్రమ్ మియర్ ఎట్రాక్షన్" అని చెప్పారు.

("For in experienced, How ever. it is very difficult to distinguish Passionate love from mere attraction" — Russell.)

అట్లాయితే లలితను నేను లవ్ చెయ్యడంలేదా ఆకర్షణ మాత్రమేనా! మే బి!

## మే - 6

లలితకు ఎలాయితేనే లెటర్ వ్రాశాను. (సాధ్యమయినంత నీట్‌గా) పవిత్ర ప్రేమకు డబ్బు ప్రతిబంధకం కాదనీ. సంస్కార హృదయమే ముఖ్యమనీ. సాధ్యమైనంత 'రొమాంటిక్'గా లెటర్ వ్రాశాను. ఆదేదో సినిమాలో కథానాయకుడు రాసినట్టు. గ్రాంధికంగా వ్రాసి డ్రాప్ చేశాను. డబ్బు అవసరం లేదని రాశానని నాన్న చూస్తే తంతారు. అయినా వాళ్ళ ఫాదర్‌కు లలిత ఒక్కతే కూతురు గదా! ఆస్తంతా ఆమెకు రాక యింకెక్కడకు పోతుంది? అనుకునే ప్లాన్ వేసి రాశాను. అయినా కట్నం లేకుండా నేనుమాత్రం చేసుకుంటా నేమిటి? సినిమా డైలాగుల్లో తప్ప డబ్బంటే యెవడికి చేదు?

## మే - 22

లలిత జవాబు వ్రాసింది. హారిబుల్ అనెక్స్‌పెక్టెడ్ 'తనకు. బావతో పదేళ్ళ క్రిందట తనకు జ్ఞానం తెలియని రోజులలో పెళ్ళయిందనీ. బావ తనంటే యిష్టంలేక యెవరో పాటిన పిల్లను పెళ్ళాడి కెనడాలో సెటిల్ అయ్యాడని. తనని పెళ్ళి చేసుకొని తన జీవితాన్ని చిగురింపజేయమనీ' రాసింది. 'తన రెండవ పెళ్ళికి ఒప్పుకోడానికి, జీవితాన్ని చిగురింపజేయడానికీ' యిదేం సినిమా కాదు. నాకెందుకొచ్చింది. నాన్న చెప్పిన సంబంధం ఒప్పుకుంటే అన్ని విధాలా బాగుంటుంది. ఆవర్గాల వేరిజ. అయిన సంబంధం పనిరి. మారుమనువు చేసుకోడానికి యిదేం సినిమా కాదు—

## మే - 24

అనుకున్నట్టే సెకండ్‌క్లాస్ వచ్చింది లలితకు కూడా సెకండ్‌క్లాస్ వచ్చింది. నాన్న చెప్పిన సంబంధం వప్పుకున్నాను తాంబూలాలు 20 వ తేదీన పుచ్చుకుంటారట.

## జూలై -6

కాలేజీకివెళ్ళి T.C.; C.C; తెచ్చుకున్నాను. లలిత బీచ్‌లో కనబడింది. మాట్లాడ్డానికి మొహం చెల్లలేదు. కానీ తప్పలేదు. "ఆడపిల్ల కనబడితే ప్రేమించెయ్యడమే ధ్యేయంగా పెట్టుకునే నీలాంటి వాళ్ళంటే నాకు చాలా అసహ్యం, ప్రేమ, ప్రేమ. అని ఆక్రోశించే నీకు ప్రేమ అంటే యేమిటో తెలియదని చెప్పడానికి అలా లెటర్ వ్రాశాను. నాకు పూర్వం మేరేజ్ అయిందని రాయడానికి కారణం నీకు తెలిసేవుంటుంది. రోడ్డుమీద లెక్చర్లు దంచుతూ తీరా రంగంలోకి దిగేసరికి వెనకడుగువేసే నిన్ను యేడిపించడానికి అలా రాసేను, మా బావతో నాకు 'సెటిల్' అయింది. 'వెడ్డింగ్ కార్డు' పంపుతాను. ఆకర్షణకు 'ప్రేమ' అనే అందమైన పేరు పెట్టకు. ఇంకా యేదో చెప్పింది. చెప్పలు వినబడలేదు.

సముద్రంలోపడి సూసైడ్ చేసుకుందామనిపించింది. కానీ చేసుకోలేక పోతున్నాను—నిజంగా నేను వ్యక్తిత్వం లేని మనిషినేమో!

★